www.aksharadarbar.com
సోమవారం 22, ఏప్రిల్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక : 69 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

కడియం కావ్యకు ఇల్లు లేదు

- భర్త నజీరుల్లా పేర ఆంధ్రప్రదేశ్ లో స్థలం
- పిల్లలు దియా నజీర్, మిహిర నజీర్ కడియం పేర 80 గ్రాముల అభరణాలు
- కావ్య పేర ఇన్నోవా వాహనం మాత్రమే
- అఫిడవిట్ లో వెల్లడించిన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

2

2 లో

అక్రమార్కులకు హెల్ప్..

చైల్డ్ హెల్ప్ లైన్ ఆఫీస్‌లో నియామకాలపై ఫిర్యాదుల వెల్లువ

మహిళ శిశు సంక్షేమ శాఖలోని కొందరు అధికారులు తమ స్వప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు పాతరేసి అక్రమాలకు తెరలేపుతున్నారు. విధి నిర్వహణలో నవ్వి పోదురుగాక నాకేమిటి అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. దీంతో వరంగల్ జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ అక్రమాలకు కేరాఫ్ గా మారుతుంది. ఇక్కడ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో కొద్ది నెలల ఔట్ సోర్సింగ్ పద్ధతిన జరిగిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పలు పోస్టుల భర్తీలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో కొద్ది నెలల క్రితం ఔట్ సోర్సింగ్ పద్ధతిన జరిగిన ఉద్యోగ నియామకాల్లో సూపర్ వైజర్ నియామకంలో అర్హులను పక్కనపెట్టి అనర్హుడికి అవకాశం కల్పించడంపై ఈనెల 19న 'కృష్ణార్పణం' శీర్షికన 'అక్షర దర్బార్' పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే సూపర్ వైజర్ నియామకంలోనే కాకుండా ఇతర పోస్టుల నియామకంలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నట్లు తాజాగా బయటపడింది.

—అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

- కోఆర్డినేటర్ , కేస్ వర్కర్ నియామకాల్లోనూ నిబంధనలకు పాతర
- అర్హులకు పక్కనపెట్టి అనర్హులకు అందలం
- ఆర్థికపరమైన అవగాహనతో అడ్డదారిలో నియామకాలు
- అన్నీ తానై వ్యవహరించిన ఓ ఉన్నతాధికారి

నామినేషన్ల కోలాహలం..

4

పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు సమీపించడంతో సోమవారం కోలాహలం కనబడింది. ఆయా పార్లమెంటు స్థానం నుంచి పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు కూడా ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాల నుంచి సోమవారం 14 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.

—అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

నేడు వరంగల్ కు కేటీఆర్

వివరాలు 4వ పేజీలో..

ఎమ్మెల్సీ కవితను వీడని కష్టాలు

- బెయిల్ పిటిషన్ వాయిదా

వివరాలు 4వ పేజీలో..

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

అక్రమార్కులకు హెల్ప్..

- చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో నియామకాలపై ఫిర్యాదుల వెల్లువ
- కోఆర్డినేటర్, కేస్ వర్కర్ నియామకాల్లోనూ నిబంధనలకు పాతర
- అర్హులకు పక్కనపెట్టి అనర్హులకు అందలం
- ఆర్థికపరమైన అవగాహనతో అడ్డదారిలో నియామకాలు
- అన్నీ తానై వ్యవహరించిన ఓ ఉన్నతాధికారి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

మహిళ శిశు సంక్షేమ శాఖలోని కొందరు అధికారులు తమ స్వప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు పాతరేసి అక్రమాలకు తెరలేపుతున్నారు. విధి నిర్వహణలో నవ్వి పోదురుగాక నాకేమిటి అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. దీంతో వరంగల్ జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ అక్రమాలకు కేరాఫ్ గా మారుతుంది. ఇక్కడ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో కొద్ది నెలల ఔట్ సోర్సింగ్ పద్ధతిన జరిగిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పలు పోస్టుల భర్తీలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో కొద్ది నెలల క్రితం ఔట్ సోర్సింగ్ పద్ధతిన జరిగిన ఉద్యోగ నియామకాల్లో సూపర్ వైజర్ నియామకంలో అర్హులను పక్కనపెట్టి అనర్హుడికి అవకాశం కల్పించడంపై ఈనెల 19న 'కృష్ణార్పణం' శీర్షికన 'అక్షర దర్బార్' పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే సూపర్

వైజర్ నియామకంలోనే కాకుండా ఇతర పోస్టుల నియామకంలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నట్లు తాజాగా బయటపడింది. ఈ చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన వివిధ పోస్టుల నియామకం జరిగింది. వీటిలో కోఆర్డినేటర్, కేస్ వర్కర్ తదితర పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో అర్హులకు గాకుండా కాదని అనర్హులను ఉద్యోగ నియామకాల్లో అవకాశం దక్కడంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్జన కోసం శాఖలోని కొందరు ఈ అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుంది.

కోఆర్డినేటర్ పోస్ట్

ఈ చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో జరిగిన కోఆర్డినేటర్ పోస్ట్ నియామకంలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో అర్హుల జాబితాలో నుంచి అధికారులు మొదట ముగ్గురు పేర్లతో షార్ట్ లిస్ట్ రూపొందించారు. ఆ ముగ్గురు కూడా ఈ శాఖలో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులే. ఇ తర్వాత షార్ట్ ముగ్గురు అభ్యర్థులు కూడా నాన్ లోకల్ అని షార్ట్ లిస్టును పక్కనపెట్టి మరో అభ్యర్థిని కోఆర్డినేటర్ పోస్ట్ కోసం అధికారులు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూ దాకా వెళ్ళాక నాన్ లోకల్ పేరుతో షార్ట్ లిస్టులోని ముగ్గురు అభ్యర్థులను ఎవరిని కాదని మరో అభ్యర్థిని కోఆర్డినేటర్ గా నియామకం చేయటం విమర్శలకు తావిచ్చింది. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అవగాహన కుదిరినట్లు సమాచారం. నెల నెల ప్రభుత్వం నుంచి వచ్చే వేతనం నుంచి కొంత డబ్బు సదరు అభ్యర్థికి సహకరించిన అధికారులకు వెళ్లే విధంగా అగ్రిమెంట్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.

కేస్ వర్కర్ విషయంలోనూ

ఈ కార్యాలయంలో కేస్ వర్కర్ నియామకం కూడా అడ్డదారిలో జరిగినట్లు తెలిసింది. ఇదే శాఖలో జిల్లాలోని ఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి కూతురు ఈ కేస్ వర్కర్ గా నియామకమైనట్లు సమాచారం. ఆమె విధులకు కూడా హాజరు కాకపోతుండటం ప్రస్తుతం ఇక్కడ చర్చనీయమైంది. ఎప్పుడూ సెలవుపైనే ఉంటున్నట్లు సమాచారం. మరో పోస్ట్ నియామకంలో ఈ శాఖకు చెందిన ఓ కమిటీ మెంబర్ సహకారం ఉన్నట్లు సమాచారం. ఇలా చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఓ ఉన్నతాధికారి అన్నీ తానై అక్రమాలకు ఒడిగట్టినట్లు తెలుస్తుంది. ఉన్నతాధికారులు ఈ నియామకాలపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే తమకందిన ఫిర్యాదులపై ప్రభుత్వ నిఘా వర్గాల అధికారులు ఈ నియామకాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

కడియం కావ్యకు ఇల్లు లేదు..

- భర్త నజీరుల్లా పేర ఆంధ్రప్రదేశ్ లో స్థలం
- పిల్లలు దియా నజీర్, మిహిర నజీర్ కడియం పేర 80 గ్రాముల ఆభరణాలు
- కావ్య పేర ఇన్నోవా వాహనం మాత్రమే
- అఫిడవిట్ లో వెల్లడించిన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు సొంత ఇల్లు లేదు. ఆమె భర్త మహమ్మద్ నజీరుల్లా పేరిట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలో స్థలం ఉంది. సోమవారం కావ్య నామినేషన్ దాఖలు చేశారు. వరంగల్ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కావ్య సమర్పించిన అఫిడవిట్ లోని అంశాలు చర్చనీయాంశమయ్యాయి.

- 2022–23 ఆర్థిక సంవత్సరానికి కావ్య రూ.9,28,620, నజీరుల్లా రూ.13,16,500 ఆదాయం సమకూరినట్లు ఐటీ రిటర్న్ లో తెలిపారు.
- కావ్య, ఆమె భర్త పేరిట ఎలాంటి పోలీసు కేసులు లేవని పేర్కొన్నారు.
- కావ్య చేతిలో నగదు రూ.80వేలు, నజీరుల్లా చేతిలో రూ.35వేలు
- మూడు బ్యాంక్ ఖాతాల్లో మొత్తం రూ.4,67,383.91, నజీరుల్లా ఖాతాలో రూ.1,21,366 నిల్వ ఉంది
- 2022లో రూ.31,12,711 వెచ్చించి ఇన్నోవా క్రిస్టా వాహనాన్ని కావ్య కొనుగోలు చేశారు. 2021లో రూ.2,04,367 ఖర్చు చేసి నజీరుల్లా రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని, 2022లో హోండా ఆక్టివా వాహనాన్ని రూ.76,001తో కొన్నారు.
- రూ.15,96,480 విలువ చేసే 210 గ్రాముల ఆభరణాలు కావ్యకు ఉన్నాయి. రూ.4,56,240 విలువ చేసే 60 గ్రాముల ఆభరణాలు నజీరుల్లాకు ఉన్నాయి. దియా నజీర్ కు రూ.3,80,200 విలువ చేసే 50 గ్రాముల, మిహిర నజీర్ కడియంకు రూ.2,28,120 విలువ చేసే 30 గ్రాముల ఆభరణాలు ఉన్నాయి. నగదు, ఖాతాలో, వాహనాలు, ఆభరణాల మొత్తంగా కావ్య పేరిట రూ.56,62,165.91, నజీరుల్లా పేరిట రూ.86,42,303 ఉన్నాయి.
- కావ్య పేరిట ఎలాంటి వ్యవసాయ, వ్యవసాయేతర భూములు లేవు
- నజీరుల్లా పేరిట వ్యవసాయేతర భూమి ఏపీలోని బాపట్ల జిల్లా మూలపాలెంలో ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ.5,88,240 ఉండే 2606.4 చదరపు అడుగుల స్థలం ఉంది.
- లోన్ రూ.19,17,228 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కావ్య చెల్లించాల్సి ఉంది. బజాజ్, చోలమండలం, టాటా కాపిటల్ ఫైనాన్స్ సంస్థల్లో వేర్వేరుగా తీసుకున్న రుణాలకు సంబంధించి నజీరుల్లా రూ.83,41,973 చెల్లించాల్సి ఉంది.

కుటుంబ సభ్యుల వివరాలు

కడియం కావ్య

భర్త పేరు : మహమ్మద్ నజీరుల్లా

పిల్లలు : దియా నజీర్, మిహిర నజీర్ కడియం

సుధీర్ కుమార్ కు అప్పులు లేవు..

- సుధీర్ దంపతుల పేర 18 ఎకరాల భూమి



అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సమర్పించిన అఫిడవిట్ లో తన ఆస్తుల, అప్పుల వివరాలను వెల్లడించారు. సుధీర్ కుమార్, ఆయన భార్య గనిపాక శోభారాణి పేర ఉన్న స్థిర, చరాస్తుల సమాచారాన్ని ఎన్నికల అ ధికారుల కు అందించారు.

- గత ఐదేళ్లుగా సుధీర్ ఎలాంటి ఐటీ రిటర్న్స్ దాఖలు చేయలేదు. శోభారాణి మాత్రం 2023–24 ఆర్థిక సంవత్సరానికి 9,84,380 ఆదాయంపై ఐటీ రిటర్న్స్ లో పేర్కొన్నారు.
- వీరి పేర ఎలాంటి పోలీసు కేసులు లేవు.
- సుధీర్ చేతిలో నగదు రూ.1.50 లక్షలు, శోభారాణి చేతిలో నగదురూ.2లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు.
- సుధీర్ బ్యాంక్ ఖాతాలో రూ.18,660, ఆయన భార్య ఖాతాలో రూ.4,917 ఉన్నాయి.
- రూ. 1.40లక్షల విలువ చేసే 20గ్రాముల బంగారు వస్తువులు, రూ.4,20,000 విలువ చేసే 60 గ్రాముల ఆభరణాలున్నాయి.
- నగదు, ఖాతా, బీమా, బంగారు ఆభరణాలు విలువ సుధీర్ పేర రూ.5,15,410, భార్య పేర రూ.20,14,917 ఉన్నాయి.
- భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో 210 ఏ సర్వే నంబర్ లో రెండు ఎకరాల 9గుంటల వ్యవసాయ భూమి సుధీర్ పేర ఉంది. ప్రస్తుతం దాని మార్కెట్ విలువ సుమారు రూ. 12.54 లక్షలు. భార్య పేర కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో రెండెకరాలు, ఐనవోలు మండలం వనమాల కనపర్తిలో 13.31 ఎకరాలుంది. ప్రస్తుతం మార్కెట్ ధర దాదాపు రూ.85.86లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.
- సుధీర్ పేర లష్కర్ సింగారంలో రూ.60లక్షల విలువ చేసే 300 చ.గ వ్యవసాయేతర భూమి, రూ.21,26,670 విలువ చేసే ఇల్లు ముల్కనూరులో ఉంది.
- సుధీర్ దంపతుల పేర ఎలాంటి అప్పులు లేవు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కడియం కావ్య

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

అక్షర దర్బర్ , పరకాల : కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య అన్నారు. పరకాలలో సోమవారం నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జీ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి తరిమి కొట్టాలని, 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోడీ 2 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. బీజేపీ అబద్ధపు ప్రచారాలు నమ్మొద్దని అన్నారు. నా గెలుపు కోసం మీరు పని చేయండి.. రానున్న 5 ఏళ్లు మీ కోసం నేను కృషి చేస్తాను. మీరు నాకు తోడుగా నిలవండి.. నేను మీకు అండగా ఉంటాను అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగురి భిక్షపతి, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బోణి

- కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- సూరత్ బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవం

అక్షర దర్బార్, హైదరాబాద్ : సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బోణి కొట్టింది. గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలేశ్ కుంభానీ సమర్పించిన నామినేషన్ ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభానీ నామినేషన్ పత్రాలపై ప్రపోజర్లుగా సంతకాలు చేసిన ముగ్గురు వ్యక్తులు ఆదివారం ఎన్నికల అధికారి ఎదుట హాజరయ్యేందుకు నిరాకరించారు. తాము ఆ పత్రాలపై సంతకాలు చేయలేదని వారు ముగ్గురు స్పష్టం చేసిన కారణంగా కాంగ్రెస్ పార్టీ నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆ వెంటనే సూరత్ స్థానం నుంచి నామినేషన్లు వేసిన మరో 8 మంది పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసింది. బీజేపీకి వ్యతిరేకంగా విమర్శలు గుప్పించే బీఎస్పీ అభ్యర్థి ప్యారేలాల్ భారతి సైతం పోటీ నుంచి వైదొలగడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. కాంగ్రెస్ పార్టీ ముందు జాగ్రత్తగా సురేశ్ పడసాల అనే వ్యక్తితోనూ రెబల్ గా నామినేషన్ వేయించినప్పటికీ అది కూడా తిరస్కరణకు గురికావడంతో కాంగ్రెస్ షాక్ కు గురైంది. సరైన పత్రాలు లేని కారణంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. నాటకీయ పరిణామాల మధ్య ముకేశ్ దలాల్ సూరత్ నుంచి ఏకగ్రీవంగా లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ప్రభుత్వం కల్పించిన 5శాతం రిబేట్ అవకాశాన్ని ఇంటి యజమానులు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే కోరారు. హోటల్ రత్న, ఏషియన్ శ్రీదేవి మాల్ యాజమాన్యాలు ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి 5శాతం రిబేట్ పొందారు. ఏషియన్ శ్రీదేవి మాల్ యాజమాన్యం రూ.12.3 లక్షల చెక్ ను డిప్యూటీ కమిషనర్ రవీందర్ కు, రత్న హోటల్ యాజమాన్యం రూ.4,50,135 చెక్ ను అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 30లోగా పన్నులు చెల్లించే నగర వాసులకు ప్రభుత్వం 5శాతం రిబేట్ అవకాశాన్ని కల్పించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారులు యూసుఫోద్దీన్, షహజాది బేగం, రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు సోహైల్, భరత్ చంద్ర, శ్రీకాంత్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్‌పై వేటు?

అక్షర దర్బార్, మల్హర్ : మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్ విండో డైరెక్టర్ మల్కా రాజేశ్వర్ రావు సస్పెండైనట్లు సమాచారం. పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో సొసైటీ ఆదాయం పెంచడానికి, అభివృద్ధికి కృషి చేస్తామని, రైతులకు సొసైటీ ద్వారా ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచుతామని ప్రతిజ్ఞ చేసిన విషయం విదితమే. అయితే రాజేశ్వర్ రావు పీఏసీఎస్ లో ఒక సింగిల్ విండో డైరెక్టరై ఉండి సొసైటీ ఆదాయానికి గండికొట్టేలా, సహకార చట్టానికి విరుద్ధంగా తాడిచెర్లలో ప్రైవేటుగా ఎరువుల, విత్తనాల వ్యాపారం చేస్తున్నట్లుగా, సొసైటీలో ఉన్న కొంతమంది సభ్యులు ఇటీవల ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. ఈ ఫిర్యాదు మేరకు భూపాలపల్లి డిసిఓ డి. శైలజ పూర్తి విచారణ చేపట్టి ఈ నెల 20న రాజేశ్వర్ రావును సహకార సంఘం యాక్ట్ 1964 ప్రకారం సస్పెండ్ చేసినట్లుగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మాజీ ప్రజాప్రతినిధిపై కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని కాశీంపల్లి శివారులోని తమ భూమిని ఓ మాజీ ప్రజాప్రతినిధి బెదిరించి అక్రమంగా పట్టా చేయించుకున్నారని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ భవేష్ మిశ్రాకు కాశీంపల్లి గ్రామానికి చెందిన 14 మంది రైతులు ఫిర్యాదు చేశారు. మా భూములను మాకు ఇప్పించాలని జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదులో వారు వేడుకున్నారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రెండు వారాల్లో ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు బాధిత రైతులు తెలిపారు.

కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన కాశీంపల్లి గ్రామస్తులు

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ లో సోమవారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన దుర్గం ప్రశాంత్ వద్ద రూ.2.14లక్షల విలువ చేసే 29.011 గ్రాముల బంగారు నగలు, రూ.9వేల విలువ చేసే 10గ్రాముల వెండి కాయిన్స్, రూ.3వేల విలువ చేసే చేతి గడియారం, రూ.1.14లక్షల విలువ చేసే 14మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు ఆర్పీఎఫ్ ఇన్ స్పెక్టర్ నరేష్ తెలిపారు. జీఆర్పీ ఎస్సై ఎం.ఐలయ్య తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఏసీబీ తనిఖీలు

హన్మకొండ, సూర్యాపేటలో సోదాలు

అక్షర దర్బార్, హనుమకొండ : సబ్ రిజిస్ట్రార్ తస్లిమా మహమ్మద్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆమె గత నెల 22న ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హనుమకొండలోని ఆమె నివాసంలో, ఆమె భర్త నివాసం ఉండే సూర్యాపేటలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేశారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల


వివాహ వేడుకకు హాజరైన వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం నర్సక్కపల్లె గ్రామానికి చెందిన నాగుర్ల జిజియాబాయి– నాగేశ్వర రావు కుమారుడు ఉమేష్ చంద్ర–భవానీ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అరే సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, అరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంగ్లి శివాజీ, నాయకులు మనోహర్ రావు, గుండెకారి రంగారావు, ఫర్టిలైజర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి..

అక్షర దర్బార్, పరకాల: అన్ని శాఖల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు అన్నారు. పరకాల మండల పరిధిలోని మల్లక్కపేటలో సోమవారం గ్రామసభ ప్రత్యేక అధికారి పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అన్ని శాఖల గ్రామ స్థాయి అధికారులు హాజరై తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా అతి త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభకు హాజరుకాని ఏఈవో, లైన్ మెన్, రేషన్ డీలర్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులపై చర్యల కోసం కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓరుగంటి శైలజ, ఏపీవో ఇందిర, ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, శ్రీనివాస్ అంగన్వాడీ టీచర్లు, ఆశలు, వీవో, సీఏలు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ కార్నర్ సమావేశం

మండల అధ్యక్షుడు రాజయ్య

అక్షర దర్బార్, మల్హర్ : తాడిచెర్లలో రేపు (మంగళవారం) జరగనున్న కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల కార్నర్ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు సోదరుడు, కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు అధ్యక్షతన మండల కాంగ్రెస్ కార్నర్ సమావేశం జరుగుతుందని అన్నారు. కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ హాజరవుతున్నారని తెలిపారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

వరంగల్ లో నామినేషన్లు దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్

మహబూబాబాద్ లో నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్

నామినేషన్ల కోలాహలం..

- వరంగల్ లో పదిమంది
- మహబూబాబాద్ లో నలుగురు
- కావ్య, సుధీర్ కుమార్, సీతారాం నాయక్ నామినేషన్ల దాఖలు
- రెండు స్థానాల్లో మొత్తం 28 మంది నామినేషన్లు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు సమీపించడంతో సోమవారం కోలాహలం కనబడింది. ఆయా పార్లమెంటు స్థానం నుంచి పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు కూడా ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాల నుంచి సోమవారం 14 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, బీఆర్ఎస్ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. కావ్య వెంట వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య ఉన్నారు. కావ్య నామినేషన్ కార్యక్రమానికి స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు శేఖర్ రావు, బొల్లె బిక్షపతి, బొజ్జం రమేష్, పర్నెం తిరుపతిరెడ్డి, మడికొండ సంపత్, శ్రీను తదితరులు హాజరయ్యారు. ఈ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా తాళ్లపల్లి వెంకటయ్య, మంద నరేష్, బి రాజు, శనగరపు రమేష్ బాబు, పోగుల అశోక్, ధర్మ సమాజ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా ఇసంపల్లి వేణు, విధు థలై చిరుథగల్ కాచి పార్టీ అభ్యర్థిగా మచ్చ దేవేందర్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రావీణ్యకు అందజేశారు. వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి పదిమంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఇక్కడ ఈనెల 18 నుంచి నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల సంఖ్య 19 మందికి చేరింది.

మహబూబాబాద్ లో...

మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుంచి సోమవారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి అజ్మీరా సీతారాం నాయక్, స్వతంత్ర అభ్యర్థులుగా పాల్వంచ దుర్గ, ఎం.అరుణ్ కుమార్, యూసీసీఆర్ ఐఎంఎల్ పార్టీ అభ్యర్థిగా పగిడి ఎర్రయ్య తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌కు అందజేశారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో మొత్తం నామినేషన్ల సంఖ్య 9కి చేరింది. ఈనెల 18న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ 25న ముగియనుంది.

తిరుమలలో వైభవంగా శ్రీవారి స్వర్ణ రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల

అక్షర దర్బార్, తిరుమల : తిరుమలలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామి స్వర్ణరథంపై దర్శనమిచ్చారు. తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అత్యంత వైభవంగా సాగిన స్వర్ణ రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు. రథోత్సవంలో పాల్గొనడం వల్ల లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలు.. భూదేవి కరుణతో సమస్త ధాన్యాలూ.. శ్రీవారి కరుణా కటాక్షాలతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం. కార్యక్రమంలో తితిదే ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఈనెల 24న ఇంటర్ ఫలితాలు

అక్షర దర్బార్, హైదరాబాద్ : తెలంగాణలో ఇంటర్ ఫలితాల విడుదలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 24 ఉదయం 11గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను విడుదల చేస్తామని ప్రభుత్వ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీలో ఫలితాలు విడుదల చేయడంతో రాష్ట్ర విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులను సంప్రదించి ఫలితాలు విడుదల చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు.

నేడు నగరానికి కేటీఆర్ రాక..

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఎన్నికల వేళ నగరానికి రాజకీయ ప్రముఖుల రాకతో సందడిగా మారింది. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నగరంలో పర్యటించనున్నారు. వరంగల్ తూర్పు సెగ్మెంట్ కార్యకర్తలతో నాని గార్డెన్స్ లో సమావేశం కానున్నారు. అనంతరం వర్ధన్నపేట సెగ్మెంట్ నేతలతో హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్లో సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నికల్లో వరంగల్ అభ్యర్థిని గెలిపించడంపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

అక్షర దర్బార్, హనుమకొం : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.4వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. హనుమకొండ ఇన్ స్పెక్టర్ సతీష్ వివరాల ప్రకారం.. 2017లో నద్దునూరి మురళిని పాత గొడవలను మనసులో పెట్టుకొన్న జనగాని సృజన్ కత్తితో పొడిచాడు. చికిత్స పొందుతూ మురళీ మృతి చెందాడు. మృతుడి తండ్రి నద్దునూరి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. అప్పటి దర్యాప్తు అధికారి ఏసీపీ జి.రాజేంద్రప్రసాద్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. కోర్టులో సాక్షులను కోర్టు కానిస్టేబుల్ ఎం.సుభాష్ సక్రమంగా ప్రవేశపెట్టగా, నేరస్తుడికి శిక్షపడేలాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ ఎం.సత్యనారాయణ వాదనలు వినిపించారు. ప్రస్తుత హనుమకొండ ఏసీపీ కె.దేవేందర్ రెడ్డి సూచనల మేరకు ఎప్పటికప్పుడు కోర్టులో ట్రయల్ నడిపించినట్లు సీఐ పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం నిందితుడికి జీవత ఖైదు, రూ.4వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది.

ఎమ్మెల్సీ కవితను వీడని కష్టాలు

- బెయిల్ పిటిషన్ వాయిదా

అక్షర దర్బార్, ఢిల్లీ : లిక్కర్ కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా పడింది. ఈడీ కేసులో విచారణ మంగళవారానికి, సీబీఐ కేసులో మే2కు వాయిదా పడింది. కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె కోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని, ఏడేళ్లలోపు జైలు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదని ఆమె తరుపు న్యాయవాది వాదించారు. మరోవైపు కవితకు బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ కోర్టును కోరింది. ఆమె దర్యాప్తును ప్రభావితం చేయగలరని సీబీఐ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని వివరించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది.